క్లుప్తంగా

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గిరి

శ్రీరంగరాజపురం: గ్రామీణుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరంలా మారిందని మండల వైద్యాధికారి డాక్టర్ గిరి అన్నారు. గిద్దమహారాజపురం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 87 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసారు. గర్భిణులు, చిన్న పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు చేసి, సూచనలు, సలహాలు అందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



విజయపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

విజయపురం (నగరి): మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ వెంకటరమణరెడ్డి శనివారం తనిఖీ చేశారు. మండలంలోని పన్నూరు, ఆలపాకం, జగన్నాథపురం, విజయపురం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

చిత్తూరు కార్పొరేషన్: సిద్ధ సమాధి యోగా శిక్షణ తరగతులను ఆదివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని యోగాచార్యులు నరేంద్రకుమార్, బ్రహ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విజయం డిగ్రీ కళాశాలలో 14 ఏళ్లు పైబడిన వారికి 14 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగలవారు 8247609140ను సంప్రదించాలని వివరించారు.

ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖులు

తిరుపతి కల్చరల్: తిరుపతి ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ అనే అంశంపై రెండు రోజుల ఆర్ట్ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఉమాముద్దుబాల జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 50 మంది చిత్రకారులు తమ చిత్రాలను, విద్యార్థుల పెయింటింగ్ పోటీల్లో ఎంపికైన చిత్రాలను ఏర్పాటు చేశారు. ఆర్ట్ సొసైటీ కార్యదర్శి ఇ.బాలసుబ్రమణ్యం, అధ్యక్షుడు డాక్టర్ హేమాక్షిఆచారి, చిత్రకారుడు సింగంపల్లి సత్యనారాయణ, రామచంద్రయ్య పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం ఎదుట మంత్రి తానేటి వనిత

తిరుమల: శ్రీవారిని శనివారం రాష్ట్ర మంత్రి తానేటి వనిత, పాండిచ్చేరి ప్రభుత్వ విప్ ఏకేడీ ఆర్ముగం, తమిళ నటుడు జయం రవి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

వైభవం.. కుంభాభిషేకం

- నగరి పట్టణానికి ఆధ్యాత్మిక శోభ
- వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఆర్కే రోజా, నారాయణి అమ్మ
- నేడు మహాకుంభాభిషేకం

నగరి: మున్సిపల్ పరిధిలో నేత్రప్రదాయని దేశమ్మ ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు శనివారం కూడా కొనసాగాయి. ధాన్యాధివాసం, వస్త్రాధివాసం, పుష్పాధివాసం, దీపోత్సవం కార్యక్రమాలతో నగరి పట్టణం ఆధ్యాత్మిక శోభతో మురిసింది. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ పూజల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా, తమిళనాడు రాష్ట్రం వేలూరు బంగారు గుడి స్థాపకులు నారాయణి అమ్మ పాల్గొన్నారు. ఆలయకమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్రయ్య వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దేవతామూర్తుల వేషధారణలో విచ్చేసిన కళాకారులు అందరినీ మెప్పించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం భక్తజనంతో కిక్కిరిసింది. మంత్రి రోజా దేశమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశమ్మతల్లి చల్లని కరుణాకటాక్షలతో ఆలయ నిర్మాణంతోపాటు మహాకుంభాభిషేక వేడుకలు వైభవంగా జరిగే కార్యక్రమాలను వీక్షించిన భక్తులు ఆధ్యాత్మికానందంలో మునిగితేలారని చెప్పారు. మంత్రి కుటుంబసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



అధివాసం పూజలో మంత్రి ఆర్కే రోజా



నారాయణి అమ్మకు స్వాగతం పలుకుతున్న వేదపండితులు, ఆలయ కమిటీ



విద్యుత్ స్వాగత ఆర్చి

నేడు మహాకుంభాభిషేకం

కుంభాభిషేక ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రజిత అష్టబంధన మహా కుంభాభిషేక వేడుకలు ఆదివారం జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, 11 గంటలకు మహాకుంభాభిషేకం, మహదాశీర్వాదం నిర్వహించనున్నారు.









విద్యుత్ దీపకాంతులతో మిరుమిట్లుగొల్పుతున్న దేశమ్మ ఆలయం వద్ద పోటెత్తిన భక్త జనం, మంత్రి రోజాకు కళాకారుల స్వాగతం, సాంస్కృతిక ప్రదర్శన వీక్షిస్తున్న భక్తులు, ఆకట్టుకుంటున్న దేవతా మూర్తుల కటౌట్లు

సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలసముద్రం: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని పాలసముద్రం బీసీ కాలనీలో మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. వారు గ్రామస్తులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ పథకాలు రావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని ఆదరించాలని విన్నవించారు. టీడీపీ నాయకులు మాయమాటలతో మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్ మహేష్, నాయకులు చంద్రశేఖర్ రాజు, సుమన్, వేణు, ఆనందన్, మనోహర్, రవిరెడ్డి, కుట్టి, రాజామణి, షణ్ముగరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం విజయకుమార్

కార్వేటినగరం: ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని, ఓటరుగా నమోదైన వారందరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఎం విజయకుమార్ అన్నారు. పద్మసరస్సు ఎస్టీ కాలనీలో శనివారం ఓటు ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ఓటు హక్కు నమోదైన వారందరూ నిర్భయంగా ఓటు హక్కును వినయోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడం తమ బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో 14వ ఓటరు దినోత్సవ అవగాహన బ్యానర్లతో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐకేపీ ఏపీఎం

ఓటు హక్కు వినియోగించుకోండి

పాలసముద్రం: ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కుని వినియోగించుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. ఆయన శనివారం గంగమాంబపురంలో డ్వాక్రా సంఘం సభ్యులతో కలసి ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క పౌరుడు సంపూర్ణ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యుల ద్వారా గ్రామాల్లో ఓటర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ లోకనాథం, చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, బాలాజీ, శోభ, మంజుల, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు



మఠవలంలో పూడికతీత పనులు చేస్తున్న సిబ్బంది

పాలసముద్రం: సింహరాజుపురం పంచాయతీ మఠవలం గ్రామాల్లో శనివారం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శి రాజీవ్ కుమార్ కలసి విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రజలు రోగాలబారిన పడకుండా ఇంటి పరిసరాల్లో నిలవ ఉన్న నీటిని తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, రాజీవ్ కుమార్ మాట్లాడుతూ డ్రైనేజీలో నీరు నిల్వచేసి అందులో దోమలు వృద్ధి చెంది పలు రోగాలు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల రాత్రి సమయంలో దోమ తెరలు ఉపయోగించుకుంటే మంచిదన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

స్విమ్స్‌కు విరాళం

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10,00,166ను విరాళంగా అందజేశారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కు శనివారం బెంగళూరులో స్థిరపడ్డ గుంతకల్‌కు చెందిన రాచూరు వెంకట కిరణ్, కుటుంబ సభ్యులతో కలిసి ఈ నగదును చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు. దాత వెంకట కిరణ్ మాట్లాడుతూ శ్రీవారిపై ఉన్న భక్తి విశ్వాసంతో, స్విమ్స్‌లో అందిస్తున్న వైద్య సేవలను మరింత ఉన్నతంగా అందించేందుకు తన వంతు ఈ చిరు సహాయాన్ని విరాళంగా అందజేశామన్నారు.

నేటి నుంచి ప్రసన్న వెంకన్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి అర్బన్: అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ చైర్మన్ చిన్న వెంకటేశ్వర్లు వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 11న అంకురార్పణ, 12న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేషవాహనం, 13న ఉదయం చిన్నశేష,రాత్రి హంస వాహన సేవలు, 14న ఉద యం సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవ లు, 15వ తేదీ ఉదయం కల్ప వృక్ష, రాత్రి సర్వభూపాల వాహన సేవలు, 16న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహన సేవ ఉంటుందని వివరించారు. 17న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గజ వాహనం, 18న ఉదయం సూర్య ప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు, 19వ తేదీ ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 20న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్ సభ్యులకు శిక్షణ రేపు

పుత్తూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం 9.30 గంటలకు నూతన స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు. ఈ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియను ఆయా మండలాల ఎంఈఓలు, పాఠశాలల హెచ్ఎంలు పూర్తి చేసి పంపాలన్నారు. ఉపాధ్యాయులతో పాటు డిగ్రీ పూర్తి చేసిన 25 ఏళ్ల యువకులను రోవర్ లీడర్లుగా, 21 ఏళ్ల యువతులను రేంజర్స్ లీడర్స్‌గా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అదేరోజు సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

కార్వేటినగరం: మండల కేంద్రంలోని ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీరంగరాజపురం మండలం, ఏఎం పురం గ్రామానికి చెందిన లోకనాథరాజు కుటుంబ సభ్యులు శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేశారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ దాతలు ప్రతి వారం ముందుకొచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాత లోకనాథరాజు కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న దాతలు

12న కోదండరామాలయ కుంభాభిషేకం

పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట గ్రామంలో నిర్మిస్తున్న కోదండరామస్వామి దేవాలయ కుంభాభిషేకం ఈ నెల 12న నిర్వహించనున్నట్లు అమరరాజ సంస్థ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రానాయుడు తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ తన స్వగ్రామం పేటమిట్టలో కోదండరామస్వామి దేవాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి 15 వరకు కుంభాభిషేక మహోత్సవాలు ఉంటాయని చెప్పారు. 15న సీతాలక్ష్మణ సమేత రాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వివరించారు.

చేయూత నిధులతో ఆర్థికాభివృద్ధి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం విజయకుమార్

కార్వేటినగరం: ప్రభుత్వం అందించే చేయూత నిధులను వ్యాపారం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఏపీఎం విజయకుమార్ అన్నారు. మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని పద్మసరస్సులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు చేయూత పథకం ద్వారా అందిస్తున్న నగదును సద్వినియోగం చేసుకుని ఎదగాలని సూచించారు. అనంతరం పద్మసరస్సుకు చెందిన వరలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన మాట ప్రకారం చేయూత పథకం ద్వారా అందించిన మొదటి విడత నగదుతో 10 కొబ్బరి చెట్లను అద్దెకు తీసుకుని కాయలను అమ్మి వచ్చిన ఆదాయాన్ని కుటుంబ పోషణకు వినియోగించుకున్నట్లు తెలిపారు. రెండో విడతలో వచ్చిన మొత్తంతో 20 చెట్లు, మూడో విడతలో ఇచ్చిన నగదుతో సొంతంగా ఆటో తీసుకుని కొబ్బరికాయలను మార్కెట్‌కు తరలిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నట్లు వివరించారు. తాను ఎప్పటికీ జగనన్నకు రుణపడి ఉంటానని అన్నారు. అనంతరం డ్వాక్రా సంఘం మహిళలకు చేయూత నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు.

రబీ సాగులో రైతన్నలు బిజీబిజీ



వెంగళరాజుకుప్పంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

పాలసముద్రం: మండలంలో రబీ సీజన్ ముగింపు దశకు చేరిన సమయంలో రైతన్నలు పంట సాగులో బిజీ బిజీ ఉన్నారు. వెంగళరాజుకుప్పం, సింహరాజుపురం, ఆముదాల, శ్రీకావేరి రాజుపురం గ్రామాల పరిధిలో వరినాట్లు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. రైతులు రబీ సీజన్‌లో వరి, రాగులు, మిరప తదితర పంటలు సాగు చేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందని అధికారులు సూచిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలలో ఎండలు ఎక్కువగా ఉన్నందున సాగునీటి కొరతతోపాటు విద్యుత్ కోతలు ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగానే మిరప, వరి సాగు చేస్తున్నారు. రబీ సీజన్‌లో మార్చి వరకు వేరుశనగ, రాగి, వరి, టమాట, మిరప, అనప, సజ్జ, ఇతర చిరుధాన్యాలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు 239 హెక్టార్లలో వరి, 78 హెక్టార్లలో మిరప, 138 హెక్టార్లలో వేరుశనగ, 698 హెక్టార్లలో చెరుకు సాగు చేసినట్లు వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు.



చెరుకు పంటకు బోదెలు తోలుతున్న రైతులు

హనుమంతునిపై వీరరాఘవుని విహారం



నారాయణవనం: మండల కేంద్రంలోని శ్రీకనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం హనుమంత వాహనంపై స్వామి వారు కటాక్షించారు. కేరళ సంప్రదాయ వాయిద్యాల మధ్య కొనసాగిన ఊరేగింపులో మహిళలు హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో వెయ్యిమందికి పైగా భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఆదివారం సాయంత్రం ఆలయంలో పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. భక్తులు పాల్గొన్ని వీక్షించి తరించాలని కోరారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీశనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.